సాక్షి
పెద్దపల్లి
9
గురువారం । 26 । అక్టోబర్ । 2023



వైభవంగా రథోత్సవం

రామగుండం/జ్యోతినగర్: రామగుండం అంబేడ్కర్ కూడలితోపాటు, జ్యోతినగర్ పరిధి ఐదో డివిజన్‌లోని నర్రశాలపల్లిలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి శోభాయాత్ర బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామగుండం ఎస్సై బోయ వెంకట్ పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకున్నారు. కమిటీ ప్రతినిధులు జాగటి శ్రీకాంత్, నూనె రాజేందర్ పాల్గొన్నారు.





ఓటు ఒక ఆయుధం. దాని విలువ ఉపయోగించే వ్యక్తిని బట్టి ఉంటుంది.
– టి.రూజ్‌వెల్ట్

మీకు తెలుసా?

ఏకగ్రీవ ఎమ్మెల్యే లక్ష్మీనర్సింహారావు

జగిత్యాల నియోజకవర్గం 1957లో ఏర్పడగా.. ఇప్పటివరకు కాసుగంటి లక్ష్మీనర్సింహారావు ఒక్కరే ఏకగ్రీవ ఎమ్మెల్యేగా ఎన్నికై చరిత్ర సృష్టించారు. మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన ఆయన జగిత్యాలలోనే స్థిరపడి న్యాయవాదిగా కొనసాగారు. ఆయనను ప్రజలు వకీల్‌సాబ్ అని ఆప్యాయంగా పిలిచేవారు. ఆయనకు ప్రజల్లో ఉన్న పేరు, ప్రఖ్యాతులను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ 1962 అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల టికెట్ ఇవ్వగా విజయం సాధించారు. రెండోసారి 1967లోనూ కాంగ్రెస్ తరఫున బరిలో నిలవగా.. ఆయనపై ఎవరూ పోటీ చేయకపోవడంతో ఏకగ్రీవమయ్యారు. 1972లోనూ పోటీ చేయాలని కాంగ్రెస్ కోరినా.. కొత్తవారికి అవకాశం ఇవ్వాలని టికెట్‌ను తిరస్కరించడం విశేషం. ఆయన శిష్యుల్లో నారాయణరెడ్డి మెట్‌పల్లి, రత్నాకర్‌రావు జగిత్యాల, బుగ్గారం, జగపతిరావు కరీంనగర్, జగిత్యాల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచారు. లక్ష్మీనర్సింహారావు జగిత్యాల నుంచి అసెంబ్లీకి ఆర్టీసీ బస్సులోనే వెళ్లేవారు. గ్రామాల్లో విద్యుత్, రోడ్ల సమస్యల పరిష్కారానికి ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయన జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.కోటిన్నరతో జగిత్యాల కోర్టులో న్యాయవాదుల కోసం గ్రంథాలయాన్ని నిర్మించారు.
– జగిత్యాలజోన్



లక్ష్మీనర్సింహారావు(ఫైల్)




జగిత్యాల కోర్టులో నిర్మించిన గ్రంథాలయం

ఓటు అనేది అత్యంత శక్తివంతమైన అహింసాయుత ఆయుధం.
– జాన్ లెవిస్



న్యూస్‌రీల్

విద్యుత్ కేంద్రంలో బొగ్గుపొడి నిల్వలు



కంప్యూటర్‌పై పేరుకుపోయిన బొగ్గుచూర

రామగుండం: స్థానిక బీ థర్మల్ విద్యుత్ కేంద్రంలో బొగ్గుపొడి నిల్వలు భారీగా పేరుకుపోతున్నాయి. దీంతో వివిధ విభాగాల్లోని పరికరాల పనితీరు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఫలితంగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా మిల్స్ నుంచి బాయిలర్‌లోకి బొగ్గు డంపింగ్ చేసేసమయంలో వెలువడుతున్న బొగ్గుపొడితో విభాగాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇంజినీర్లు, ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారు. మిల్స్ కేంద్రానికి సమీపంలోని ప్రధాన కంట్రోల్ రూం బొగ్గుచూరతో నిండిపోయింది. కంప్యూటర్లు, కుర్చీలు, పారామీటర్స్ తదితర పరికరాలపై బొగ్గుపొడి పేరుకుపోవడంతో ఉద్యోగులు విధులు నిర్వర్తించలేకపోతున్నారు. రాబోయే రోజుల్లో రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం భవితవ్యం ఎలా ఉంటుందోనని ఆందోళన నెలకొంది.

బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



ఖని బస్టాండ్‌లో ప్రయాణికులు

గోదావరిఖనిటౌన్: దసరా సెలవులు బుధవారం ముగిశాయి. దీంతో పల్లెలు, పట్టణాల నుంచి గోదావరిఖనికి చేరిన ప్రజలు.. తమ స్వస్థలాలకు బయలుదేరి వెళ్తున్నారు. ఈక్రమంలో గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. రద్దీకి సరిపడా బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జిల్లా కేంద్రంలో తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఎస్సై మల్లేశ్

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో పోలీసులు బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఎస్సై మల్లేశ్ ఆధ్వర్యంలో వాహనాల్లో సోదాలు చేశారు. నిబంధనలను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబాయిలో వర్షిణి స్టెప్పులు



వర్షిణిని సన్మానిస్తున్న నిర్వాహకులు

కోల్‌సిటీ(రామగుండం): దుబాయ్‌లో ఇటీవల జరిగిన బతుకమ్మ సంబురాల్లో గోదావరిఖనికి చెందిన మల్టీటాలెంటెడ్ యూట్యూబ్ స్టార్ వరుమణి వర్షిణి హల్‌చల్ చేశారు. తెలంగాణ జానపదాలు, డీజే సాంగ్స్‌పై వర్షిణి వేసిన స్టెప్పులకు అక్కడి తెలుగు ప్రజలు ఉర్రూతలూగారు. వర్షిణి ప్రతిభను అభినందిస్తూ స్పార్క్ మీడియా నిర్వాహకులు ఆమెను సన్మానించారు. కాగా, బుధవారం స్వదేశానికి తిరిగి వచ్చిన వర్షిణిని తను చదువుకున్న రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్ పీఎస్ అమరేందర్, డ్యాన్స్ మాస్టర్ సర్వేశ్ సన్మానించారు.


దరఖాస్తులకు ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: ఫిట్ ఇండియా క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు ఈనెలాఖరులోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడాల శాఖాధికారి సురేశ్ బుధవారం సూచించారు. ప్రతీఒక్కరు చురుకైన జీవనశైలిని అనుసరించేలా ప్రోత్సహించేందుకు ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ఐదేళ్లుగా అమలు చేస్తోందన్నారు. జేఈఈ, నీట్ నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా ఫిట్ ఇండియా క్విజ్ రిజిస్ట్రేషన్ ప్రిలిమినరీ నిర్వహిస్తారన్నారు.

కాపుల సమరం!

అసెంబ్లీ బరిలో బీసీలు!

- రంగంలో మున్నూరుకాపులు
- కరీంనగర్, వేములవాడ, రామగుండంలో దూకుడు
- పద్మశాలీ, ముదిరాజ్, గౌడ, కురుమ అభ్యర్థులూ పోటీ
- స్థానికత, సామాజిక సమీకరణాలపై నేతల ఆశలు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఈసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పలువురు బీసీ నేతలు ఉన్నారు. వీరిలో అధికశాతం బలమైన సామాజిక నేపథ్యం, ఉన్నత విద్యావంతులు, రాజకీయ అనుభవం కలిగిన వారే కావడం విశేషం. మున్నూరుకాపు సామాజికవర్గం నుంచి ఎక్కువ మంది అభ్యర్థులు ఉండటం గమనార్హం. వీరే కాక, పద్మశాలీ, గౌడ, ముదిరాజ్, యాదవ తదితర బలమైన సామాజికవర్గాల నుంచి రాజకీయ ఆశావహులు బరిలో నిలుస్తున్నారు. నోటిఫికేషన్ విడుదలకు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో మరింత మంది బీసీలు అసెంబ్లీ బరిలోకి దిగుతారని సమాచారం. స్థానికత, బీసీ నినాదం, పార్టీ చరిష్మా, మార్పు తదితర అంశాలు తమ విజయానికి దోహదపడతాయని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం బలమైన బీసీ సామాజికవర్గానికి చెందిన నేతలు పోటీ పడుతున్న నియోజవకర్గాలను ఒకసారి పరిశీలిద్దాం.

వేములవాడ: ఇక్కడి నుంచి గత నాలుగు పర్యాయాలుగా పోటీ చేస్తున్న ఆది శ్రీనివాస్(కాంగ్రెస్) ఈసారి కూడా బరిలో ఉన్నారు. మున్నూరు కాపు కావడం, దాదాపు 30 వేల పైచిలుకు ఓట్లు తన సామాజికవర్గానికి చెందినవే ఉండటంతో విజయంపై ధీమాగా ఉన్నారు. అదే సామాజికవర్గానికి చెందిన డాక్టర్ గోలి మోహన్ బీఎస్పీ నుంచి పోటీలో ఉన్నారు. కురుమ సామాజికవర్గానికి చెందిన తుల ఉమ బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్నారు. యాదవులు, కురుమల ఓట్లు 25 వేల వరకు ఉన్నాయని, విజయం సాధిస్తానని ఆమె భావిస్తున్నారు.

కోరుట్ల: బీజేపీ నుంచి బీసీ నేత, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ బరిలో ఉన్నారు. తన అమ్మమ్మ బంధుగణం, స్నేహితులు, సన్నిహితులు ఇక్కడే ఉండటం, బలమైన మున్నూరుకాపు సామాజికవర్గం, వారివి 26 వేల ఓట్లు ఉండటం మిగిలిన బీసీ కులాలు కూడా మద్దతిస్తారని అర్వింద్ వర్గం ధీమాగా ఉంది. వీటికితోడు ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానన్న హామీ తన విజయానికి దోహదపడుతుందని అంటున్నారు.

జగిత్యాల: బీజేపీ నుంచి పద్మశాలీ సామాజికవర్గానికి చెందిన భోగ శ్రావణి బరిలో ఉన్నారు. సొంత సామాజికవర్గానికి చెందిన 20 వేల ఓట్లు, ప్రధాని మోదీ చరిష్మా, బీసీ నినాదం, ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసి వస్తాయని ఆమె వర్గం అంటోంది.

కరీంనగర్: బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి గంగుల కమలాకర్ బరిలో ఉన్నారు. రాష్ట్రంలోనే బలమైన బీసీ నేతగా గుర్తింపు పొందారు. మున్నూరుకాపు సామాజికవర్గం కావడం, నియోజకవర్గంలో దాదాపు 40 వేల పైచిలుకు వారివే ఓట్లు ఉండటం, కేబుల్ బ్రిడ్జి, స్మార్ట్ సిటీ, మానేరు రివర్‌ఫ్రంట్, సంక్షేమ పథకాలు నాలుగోసారి శాసనసభకు పంపుతాయని గంగుల అభిమానులు లెక్కలు వేసుకుంటున్నారు.

- మరోవైపు బీజేపీ నుంచి బరిలో నిలవనున్న ఎంపీ బండి సంజయ్ కూడా ఇదే సామాజికవర్గం కావడం గమనార్హం. రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీని బలోపేతం చేసిన తీరు, హిందుత్వ నినాదం, కేంద్ర నిధులు, ప్రధాని మోదీ చరిష్మా తదితరాలు కలిసివస్తాయని ధీమాగా ఉన్నారు.

హుజూరాబాద్: ఏడుసార్లు ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన ఈటల రాజేందర్ మరోసారి బరిలో నిలవనున్నారు. బలమైన ముదిరాజ్ సామాజికవర్గం కావడం, నియోజకవర్గంలో వారివే 26 వేల ఓట్లు ఉండటం, మంత్రిగా గతంలో ఇక్కడ చేసిన అభివృద్ధి పనులతో తనకు మరోసారి ప్రజా ఆశీర్వాదం లభిస్తుందని విశ్వసిస్తున్నారు.

రామగుండం: ఇక్కడ విచిత్ర పరిస్థితి నెలకొంది. పోటీ చేసే నాయకులంతా బీసీలే. కోరుకంటి చందర్(బీఆర్‌ఎస్), సోమారపు సత్యనారాయణ ఇద్దరూ బలమైన మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందినవారు. ఈ ఓట్లు నియోజకవర్గంలో దాదాపు 24 వేలు ఉన్నాయి. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న మక్కాన్ సింగ్ ఠాకూర్ కూడా బీసీనే. బీసీ నినాదంతోపాటు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటన, సింగరేణి ప్రైవేటీకరణ, ప్రభుత్వ వ్యతిరేకత తనను గెలిపిస్తాయని పేర్కొంటున్నారు.

మంథని: అధికార పార్టీ నుంచి పుట్ట మధు మరోసారి బరిలో నిలవనున్నారు. బలమైన మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన నేత కావడం, వీరి ఓట్లు దాదాపు 29 వేలు ఉన్నాయి. స్థానికుడు, బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గెలిపిస్తాయని ఆయన వర్గం భావిస్తోంది.

పెద్దపల్లి: బీఎస్పీ నుంచి పెద్దపల్లి అభ్యర్థిగా బరిలో దిగుతున్న దాసరి ఉషది పద్మశాలీ సామాజికవర్గం. బహుజన నినాదంతో ముందుకు సాగుతున్న ఈ ఐఐటీయన్ సొంత సామాజికవర్గం ఓట్లు దాదాపు 35 వేలు వరకు ఉన్నాయి. ప్రభుత్వంపై వ్యతిరేకత, మార్పునకు శ్రీకారం, విద్యావంతుల మద్దతు తదితర అంశాలు గెలిపిస్తాయని ఆమె వర్గం ధీమాగా ఉంది.

హుస్నాబాద్: ఇక్కడ కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, బీజేపీ నుంచి బొమ్మ శ్రీరాంచక్రవర్తి పోటీ పడుతున్నారు. గౌడ సామాజికవర్గానికి చెందిన ఓట్లు 35 వేల పైచిలుకు, మున్నూరుకాపు ఓట్లు దాదాపు 30 వేల వరకు ఉన్నాయి. సొంత సామాజికవర్గాలు, ఇతర బీసీ కులాల మద్దతు, జాతీయ పార్టీల ఇమేజ్ తమకు కలిసి వస్తాయని వారు విశ్వసిస్తున్నారు.

ఫిరాయింపుల పర్వం

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అసంతృప్త నేతలు
- ద్వితీయ శ్రేణి నాయకులకు పెరిగిన డిమాండ్
- ఎన్నికల షెడ్యూల్ సమీపిస్తుండటంతో భారీగా పెరిగిన వలసలు
- పెద్దఎత్తున తాయిలాలు, భవిష్యత్‌లో పదవుల హామీలు



సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎక్కడ చూసినా రాజకీయ చర్చే. ఎవరినోట విన్నా ఎన్నికల మాటే. ఆశావహులు, అభ్యర్థులు మొదలుకుని.. ప్రధాన పార్టీల నాయకులంతా ఒకపక్క ప్రచారం చేసుకుంటూనే, మరోవైపు ఇతర పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నాయకులకు కండువాలు కప్పుతున్నారు. ప్రతిపల్లెలోనూ కాస్త పట్టున్న ద్వితీయ శ్రేణి నాయకులను ప్రసన్నం చేసుకునేందుక ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కనీసం 100ఓట్లను ప్రభావితం చేయగల నాయకుడు అనుకుంటే చాలు.. అసంతృప్తి వ్యక్తం చేసినా, వేరేపార్టీ నుంచి వచ్చేఅవకాశం ఉన్నా చర్చల పేరిట వారివద్ద వాలిపోతున్నారు. ఇదే అవకాశంగా ద్వితీయ శ్రేణి నాయకులు, వారి అనుచరులు ఏదోవిధంగా తమ పార్టీలోకి చేర్చుకుంటున్నారు. కొందరు వచ్చి చేరుతుండగా మరికొందరు అవే పార్టీలను వీడి అవతలి పక్షాలకు మద్దతు పలుకుతున్నారు. తమకు పార్టీలో ప్రాధాన్యం దక్కడం లేదని అసంతృప్తికి లోనైన వారు, ఫలనా పార్టీలో చేరితే తమకు భారీగా ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్న వారు ఒక్కసారిగా పార్టీ కండువాలు మార్చేస్తున్నారు.

స్పష్టమైన హామీలతోనే..

- నియోజకవర్గం మొదలు జిల్లాస్థాయి కీలక నేతల నుంచి స్పష్టమైన హామీలు దక్కుతుండటంతో చేరికల సంఖ్య క్రమంగా భారీ స్థాయిలో పెరిగిపోతోంది.
- ఇదేక్రమంలో నేడు ఒకపార్టీలో చేరినవారు కొద్దిరోజుల్లోనే మళ్లీ మరోపార్టీలోకి మారిపోతున్నారు.
- నాయకులు ప్రతీసభ, సమావేశం, గ్రామపర్యాటన సందర్భంగా కొందరు కార్యకర్తలకైనా తమ పార్టీ కండువాలను కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందిస్తున్నారు.
- ఇందులో భాగంగా ఇతర పార్టీల్లో కొన్నేళ్లుగా ఉంటూ అసంతృప్తిగా ఉన్నవారిపై దృష్టి సారిస్తున్నారు.

అసంతృప్తితోనే ఇతర పార్టీల్లోకి..

- ఎన్నికల షెడ్యూల్‌కు ఇంకా కొద్దిరోజుల సమయమే ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారం చేస్తూనే క్షేత్రస్థాయిలో పట్టున్న ద్వితీయశ్రేణి నాయకుల కోసం బరిలో ఉన్న అభ్యర్థులు గాలమేస్తున్నారు. పార్టీలో పదవులు, ప్రాధాన్యం లేని అసంతృప్తులపై పార్టీలు కన్నువేస్తున్నాయి. పార్టీల ప్రతినిధుల, పల్లెల్లో, మండల స్థాయిలో కాస్తపట్టున్న నాయకులను, వారిఅనుచరవర్గాన్ని పార్టీలోకి చేర్చుకునేందుకు నగదు బహుమతులు, గిఫ్ట్‌లు, పదవులు వంటి తాయిలాలను ఎరగా వేస్తున్నారు. రాజకీయ ఆసక్తి ఉన్నవారికి త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో లేదా నియమిత పదవుల్లో చోటుకల్పిస్తామని హామీ ఇస్తున్నారు. ఇలా జిల్లాలో పార్టీఫిరాయింపులపై జోరుగా చర్చసాగుతోంది.

వీరికే ప్రాధాన్యం

- 100 ఓట్లను వేయించగల వారు
- గ్రామంలోని ఏదైనా ఒకసామాజిక వర్గాన్ని ప్రభావితం చేయగలిగేవారు
- ఎన్నికల్లో పోటీచేసి గెలుపోటములు పొందినవారు

తాయిలాలు ఇవే..	
	పదవులు
	బహుమతులు, నగదు
	భవిష్యత్‌లో పనులు

- తమపార్టీలోకి వస్తే తగిన ప్రాధాన్యం ఇవ్వటంతోపాటు భవిష్యత్‌లోనూ అన్నిరకాలుగా అండగా ఉంటామని హామీలు ఇస్తున్నారు.
- ఇలా కీలక నేతలు మొదలు.. గ్రామస్థాయి కార్యకర్తల వరకు అందరినీ ఆకర్షించేలా ప్రయత్నిస్తున్నారు.

రాక్షస పాలన సాగుతోంది



కాంగ్రెస్‌లో చేరుతున్న వారికి పార్టీ కండువా కప్పుతున్న రాజ్‌ఠాకూర్

- డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజ్‌ఠాకూర్ విమర్శించారు. బుధవారం పాలకుర్తి మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలని కోరారు. రానున్న కాంగ్రెస్ పాలనలో ప్రతీ పేద కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. చేతిగుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం పుట్నూరు గ్రామానికి చెందిన గ్రామ అధ్యక్షులు తోట ప్రశాంత్, తూడూరి రాంబాబుగౌడ్, బి.సంపత్, విజయ్, శ్రీనివాస్ కాంగ్రెస్‌లో చేరగా వారికి రాజ్‌ఠాకూర్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ముక్కర శ్రీనివాస్, వాసుదేవరావు, మునిగాల ప్రసాద్, ముంజల సప్తగిరి పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌కు బుద్ధిచెప్పాలి'

గోదావరిఖనిటౌన్: మాయమాటలతో ఆర్టీసీ కార్మికులను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ కోరారు. స్థానిక ఆర్టీసీ డిపోలో కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే కార్మిక కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

సొంతగూటికి సీఎస్సార్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మాజీ ఎంపీపీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్‌ఎస్) మాజీ అధ్యక్షుడు సి.సత్యనారాయణరెడ్డి బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పెద్దపల్లి మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తితోపాటు పలువురు నాయకులతో కలిసి బుధవారం ఆయన హైదరాబాద్ వెళ్లి ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పెద్దపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని గెలిపించాలని మంత్రి కేటీఆర్ వారికి సూచించారు. జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ పేరును ప్రస్తావిస్తూ.. ఆయనకు సమీప భవిష్యత్‌లో సముచితస్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి ఉన్న తాను తిరిగి సొంత పార్టీలోకి రావడం సంతోషంగా ఉందని సీఎస్సార్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి పాటుపడతామని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవుఫ్, ధనుంజయ్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



సీఎస్సార్‌కు పార్టీ కండువా కప్పుతున్న కేటీఆర్

మాయమాటలు నమ్మితే మోసపోతాం

- రామగుండం ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: మాయమాటలు నమ్మితే మోసపోతామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం ఆయన జీడీకే–1గనిపై కార్మికులతో మాట్లాడారు. సప్తగిరికాలనీ, గంగానగర్‌లో ప్రజాఅంకిత యాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ పాలనంతా ద్రోహం, నయవంచన, మోసంతో కూడుకున్నదని విమర్శించారు. భూకబ్జాలు, దందాలు చేసి సంపాదించిన డబ్బు సంచులతో వచ్చే నాయకుల మాటలను నమ్మ వద్దన్నారు. కార్మికుల హక్కుల రక్షణలో సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కారుణ్య నియామకాల ద్వారా కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తున్నారని తెలిపారు. రామగుండం కార్పొరేషన్‌లో రూ.350 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. మెడికల్ కళాశాల కల నెరవేరిందన్నారు. గోదావరి నది నుంచి పరిసరాల్లోని ఇళ్లలోకి వరద చేరకుండా కరకట్ట నిర్మించాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. రైతుబంధు ద్వారా ఎకరాకు ఏటా రూ.16వేలు, తెల్లకార్డుదారులకు కేసీఆర్ బీమా, తెలంగాణ అన్నపూర్ణ పథకం ద్వారా ప్రతీరేషన్‌కార్డుదారుకు సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసరా పింఛన్లు రూ.5 వేలకు, వికలాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంపు, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా అర్హులైన మహిళలకు నెలకు రూ.3 వేలు, రూ.400కే వంటగ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.15 లక్షలకు పెంచుతారని అన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, నాయకులు మూల విజయారెడ్డి, కాల్వ స్వరూప, తస్నీంభాను, దాతు శ్రీనివాస్, గంగ శ్రీనివాస్, అచ్చె వేణు, పీచర శ్రీనివాస్, జహిద్‌పాషా తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అంతర్గాం మండల నాయకుడు మద్ది బాపగౌడ్ బీఆర్‌ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే చందర్ కండువా కప్పి ఆహ్వానించారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

మంథని కాంగ్రెస్ నాయకులకు కర్ణాటక నుంచి డబ్బులు

- మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు



బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురితో పుట్ట మధు

ముత్తారం: మంథని నియోజవర్గ కాంగ్రెస్ నేతలకు కర్ణాటక నుంచి రూ.వంద కోట్లకుపైగా వచ్చాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక నుంచి వచ్చిన డబ్బుతో ఓటుకు రూ.5వేలు ఇవ్వడానికి సిద్ధపడిన కాంగ్రెస్‌ను తిప్పికొట్టడానికి బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతోపాటు పుట్ట మధు సొంత మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కాంగ్రెస్ ప్రలోభాలకు లొంగవద్దన్నారు. సోషల్ మీడియలో ప్రతిపక్షాల పోస్టులను తిప్పికొట్టాలని కోరారు. కాగా, బీజేపీ నాయకుడు మారం శ్రీనివాస్‌రెడ్డి, ఓడేడ్‌కు చెందిన కాంగ్రెస్ నేత దాసరి పవన్‌కుమార్, పారుపల్లి, కేశనపల్లి, సర్వారానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి, ఎంపీపీ జక్కుల ముత్తయ్య పటేల్, సర్పంచుల ఫోరం మండల కన్వీనర్ నూనె కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాచాపూర్‌లో జీపీ రికార్డుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వేణుగోపాల్

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని కాచాపూర్‌లో బుధవారం డీఎల్‌పీవో వి.వేణుగోపాల్ గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులతోపాటు రోజువారీ సిబ్బంది హాజరును పరిశీలించారు. స్థానికంగా నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలని, తాగునీటిని క్లోరినేషన్ చేసి, సరఫరా చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో కిరణ్, కార్యదర్శి శరత్, కంప్యూటర్ ఆపరేటర్ తిరుపతి రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

రామగిరి(మంథని): మండలంలోని నాగేపల్లికి చెందిన కట్కూరి సాయితేజ(20) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. సాయితేజ బుధవారం సెంటనరీకాలనీ నుంచి నాగేపల్లికి వస్తున్నాడు. అదే సమయంలో ఓ కారు కరీంనగర్ వైపు వెళ్తోంది. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో సాయితేజకు గాయాలయ్యాయి. అతనికి సెంటనరీకాలనీ డిస్పెన్సరీలో చికిత్స అందించారు. అనంతరం కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

మద్యం మత్తులోనే రైతు ఆత్మహత్య

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నకొమిర గ్రామానికి చెందిన పచ్చిక రవీందర్‌రెడ్డి(35) మంగళవారం ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. అయితే, అతను మద్యం మత్తులోనే క్రిమిసంహారక మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. మృతుడి భార్య బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఇద్దరు సర్పంచ్‌ల రాజీనామా




మాట్లాడుతున్న సర్పంచ్‌లు

ఎలిగేడు(పెద్దపల్లి): గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఎలాంటి సహకారం అందంచలేదని, అందుకే తాము బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నామని ఎలిగేడు సర్పంచ్ భూర్ల సింధూజ, ధూళికట్ట సర్పంచ్ గొల్లే కావేరిలు తెలిపారు. బుధవారం ఎలిగేడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోడ్డు విస్తరణ, రైతు వేదిక నిర్మాణం చేపడితే నిధులిస్తానన్న ఎమ్మెల్యే పట్టించుకోలేదని ఆరోపించారు. ఆయన తమను చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, అనుచరుల కోరిక మేరకు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు భూమేశ్, సత్యనారాయణ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

వలస నేతల వస్త్ర నేల!

- సిరిసిల్లగా మారిన నేరెళ్ల
- మెట్ట ప్రాంతం.. కార్మిక క్షేత్రం
- నాడు కాంగ్రెస్.. నేడు టీఆర్‌ఎస్



ఒకప్పటి నేరెళ్ల.. నేటి సిరిసిల్ల నియోజకవర్గం వలసనేతలకు నిలయంగా మారింది. 1952 నుంచి ఇప్పటి వరకు ప్రతీసారి ఇతర ప్రాంతాలకు చెందిన నేతలే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 1962లో ఏర్పడిన నేరెళ్ల నియోజవర్గం 2009లో సిరిసిల్లగా మారింది. నేరెళ్ల నియోజకవర్గం నుంచి గెలుపొందిన వారికి మంత్రి యోగం దక్కింది. రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన తంగళ్లపల్లికి చెందిన గొట్టె భూపతి మినహా.. కర్రెల్లి నర్సయ్య, సుద్దాల దేవయ్య, కాసిపేట లింగయ్య, ప్రస్తుత ఎమ్మెల్యే కె.తారకరామారావు స్థానికేతరులే.



కె.తారకరామారావు



కాసిపేట లింగయ్య



కర్రెల్లి నర్సయ్య



గొట్టె భూపతి



పాటి రాజం



సుద్దాల దేవయ్య

నేటి సిరిసిల్ల నాటి నేరెళ్ల ఎమ్మెల్యేలు

పదవీ కాలం	ఎమ్మెల్యే	పార్టీ
1957–1962	కర్రెల్లి నర్సయ్య	పీడీఎఫ్
1962–1967	బి.జానకీరాం	కాంగ్రెస్
1967–1972	గొట్టె భూపతి	ఇండిపెండెంట్
1972–1978	గొట్టె భూపతి	ఇండిపెండెంట్
1978–1983	పాటి రాజం	కాంగ్రెస్(ఐ)
1983–1885	పాటి రాజం	కాంగ్రెస్
1985–1989	ఉప్పరి సాంబయ్య	జనతా
1989–1994	పాటి రాజం	కాంగ్రెస్
1994–1999	సుద్దాల దేవయ్య	టీడీపీ
1999–2004	సుద్దాల దేవయ్య	టీడీపీ
2004–2009	కాసిపేట లింగయ్య	టీఆర్‌ఎస్
2009–2010	కె.తారకరామారావు	టీఆర్‌ఎస్
2010–2014(ఉపఎన్నిక)	కె.తారకరామారావు	టీఆర్‌ఎస్
2014–2015	కె.తారకరామారావు	టీఆర్‌ఎస్
2018–2023	కె.తారక రామారావు	టీఆర్‌ఎస్

సిరిసిల్ల✍

సిరిసిల్ల.. మెట్టప్రాంతం..కార్మికక్షేత్రం. ఐదు దశాబ్దాలపాటు నేరెళ్ల నియోజకవర్గంగా ఉన్న ప్రాంతం 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా సిరిసిల్లగా ఏర్పడింది. వస్త్రోత్పత్తి ఖిల్లా సిరిసిల్ల పట్టణంతో కలిసి ఒకప్పటి నేరెళ్ల(ఎస్సీ) నియోజకవర్గ పరిధిలోని ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల్లోని గ్రామాలను ఈ నియోజకవర్గంలో కొత్తగా కలిపారు. పాత నేరెళ్ల నియోజకవర్గం పరిధిలోని ఇల్లంతకుంట మండలాన్ని మానకొండూరు(ఎస్సీ)లో కలిపారు. ఒకప్పటి నేరెళ్ల రాజకీయ చరిత్రనే సిరిసిల్లకు వర్తిస్తుంది. నాటి సిరిసిల్ల నియోజకవర్గంలోని మండలాలను కలిపి కొత్తగా వేములవాడ నియోజకవర్గంగా ఏర్పాటైంది.

అరవై ఆరేళ్లుగా..

1952లో ద్విసభ్య నియోజకవర్గంగా సిరిసిల్ల ఉంది. దీని పరిధిలో వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాలు ఉండేవి. తొలిసారిగా 1952లో జరిగిన ఎన్నికల్లో పీడీఎఫ్ ఒక స్థానాన్ని, షెడ్యూల్ కులాల



టెక్స్‌టైల్ పార్క్

సమాఖ్య మరోస్థానాన్ని పొందాయి. 1957లో జరిగిన ఎన్నికల్లో రెండు స్థానాలు పీడీఎఫ్ గెలుచుకుంది. 1962లో తొలిసారిగా నేరెళ్ల నియోకవర్గం ఏర్పాటైంది. తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామం పేరిట ఈ నియోజకవర్గం ఏర్పడగా.. గంభీరావుపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల పట్టణంతోపాటు శివారు గ్రామాలతో కలిపి విస్తరించి ఉంది. నేరెళ్ల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పాటి రాజం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, చిన్ననీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. టీడీపీ హయాంలో సుద్దాల దేవయ్య సహకారశాఖ, కార్మికశాఖ మంత్రిగా కొనసాగారు. ప్రస్తుత సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖల మంత్రిగా ఉన్నారు. పాటి రాజం మంత్రిగా ఉండగానే 1994లో హఠాన్మరణం పొందారు. పాటి రాజం ఇక్కడ మూడు సార్లు, సుద్దాల దేవయ్య రెండుసార్లు, కేటీఆర్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరుగగా.. పీడీఎఫ్ ఒక్కసారి, కాంగ్రెస్, కాంగ్రెస్(ఐ) పార్టీ నాలుగుసార్లు, తెలుగుదేశం రెండు సార్లు, జనతాపార్టీ ఒక్కసారి, స్వతంత్ర అభ్యర్థులు రెండుసార్లు, టీఆర్‌ఎస్ ఐదు సార్లు గెలిచింది.

ఈ ప్రాంత ప్రత్యేకతలు

- పశ్చిమాన కామారెడ్డి, దక్షిణాన సిద్దిపేట జిల్లాతో ఈ నియోజకవర్గం కలిసి ఉంది.
- మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒక్కటైన ఎగువ మానేరు జలాశయం గంభీరావుపేట మండలం నర్మాలలో ఉంది. దీన్ని నిజాం చివరి నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1945–51 మధ్య నిర్మించారు. 32 అడుగుల నీటి సామర్థ్యం గల ఈ జలాశయం గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని 17 వేల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా.. ప్రస్తుతం 10వేల ఎకరాలకు కుదించారు.
- ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో అటవీప్రాంతం విస్తరించి ఉంది.
- సిరిసిల్ల పట్టణంలో 34 వేల మరమగ్గాలతో రెండో షోలాపూర్‌గా ఖ్యాతిగాంచింది. 75 అద్దకం, 30 సైజింగ్, 65 వార్పిన్ పరిశ్రమలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మంది కార్మికులు వస్త్రపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు.
- రాష్ట్రంలోనే తొలి టెక్స్‌టైల్ పార్కును సారంపల్లి–బద్దెనపల్లి మధ్య నెలకొల్పారు. పార్క్‌లో 115 పరిశ్రమలు వస్త్రోత్పత్తిని సాధిస్తుండగా.. 3వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు.
- నియోజకవర్గానికి ఎగువమానేరు ప్రధాన నీటి వనరు కాగా.. ఇప్పుడు మధ్యమానేరు ప్రధాన సాగునీటి వనరుగా మారింది.
- సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) సిరిసిల్ల ప్రాంతంలో విద్యుత్ పంపిణీ చేస్తుంది. దేశంలోనే అగ్రగామి సంస్థగా ఖ్యాతిగాంచింది.
- గల్ఫ్ వలసలు ఇప్పటికీ ఆగలేదు.
- నియోజకవర్గం పొడవునా మానేరుతీరం ఉండడం మరో విశేషం.

ప్రస్తుత పరిస్థితి

- ఒకప్పుడు నేరెళ్ల నియోకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. తొలినాళ్లలో పీడీఎఫ్ అభ్యర్థులు విజయం సాధించగా.. తరువాత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. పాటి రాజం మరణాంతరం జరిగిన 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సుద్దాల దేవయ్య కాంగ్రెస్ అభ్యర్థి గొట్టె భూపతిపై అనూహ్య విజయం సాధించారు. 1999లోనూ దేవయ్య గెలుపొందారు. 2004లో టీఆర్‌ఎస్ అభ్యర్థి కాసిపేట లింగయ్య, సుద్దాల దేవయ్యపై విజయం సాధించారు. 2009 మహాకూటమి అభ్యర్థిగా టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తనయుడు కె.తారకరామారావు సిరిసిల్ల బరిలో నిలిచి 171 స్వల్ప ఓట్ల తేడాతో స్వతంత్ర అభ్యర్థి కె.కె.మహేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. ప్రస్తుతం కె.కె.మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. 2010లో రాష్ట్ర సాధన ఉద్యమంలో కేటీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయగా.. తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లోనూ కేటీఆర్, మహేందర్‌రెడ్డిపై గెలుపొందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కొండూరి రవీందర్‌రావుపై కేటీఆర్ విజయం సాధించారు. ప్రస్తుతం కొండూరి రవీందర్‌రావు టీఆర్‌ఎస్‌లో చేరి, టెస్కాబ్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. తర్వాత వివిధ పరిణాలతో టీఆర్‌ఎస్ పార్టీ బీఆర్‌ఎస్‌గా మారింది. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మళ్లీ మంత్రి కేటీఆర్ బరిలో దిగుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా కె.కె. మహేందర్ రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా రాణి రుద్రమారెడ్డి పోటీలో ఉంటుండగా.. ఇంకా బీఎస్పీతోపాటు ఇతర పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించలేదు. సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు రాష్ట్ర కీలకమంత్రిగా ఉండడంతో జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గంలో గత తొమ్మిదేళ్లలో అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి. మెడికల్ కాలేజీ, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్, వ్యవసాయ డిగ్రీ కాలేజీతోపాటు గార్మెంట్ పరిశ్రమ విస్తరించాయి. జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరిగాయి.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగండి

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు



బహుమతి అందిస్తున్న పుట్ట మధు

మంథని: గ్రామీణస్థాయి క్రీడా పోటీల ద్వారా క్రీడాకారుల్లోని నైపుణ్యం వెలుగులోకి వస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. క్రీడాస్ఫూర్తితో ఆడితే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నాలుగురోజులుగా ఆకుల భవానీశంకర్ స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. బుధవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. టోర్నీ క్రీడాకారుల ప్రతిభకు గుర్తింపు ఇస్తుందన్నారు. ప్రతీ క్రీడాకారుడు గొప్పగా ఆడి జాతీయస్థాయిలో రాణించి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, కౌన్సిలర్లు కాయిత సమ్మయ్య, వీకే రవి, ఆర్గనైజర్లు ఆకుల నవీన్, పోలు రేవంత్, మేదరి వినయ్, అల్లం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రయోజనం శూన్యం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మంథని: కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతులకు ప్రయోజనం శూన్యమని, పైగా నిర్మాణంలో అనేక లోపాలు బయటపడుతున్నాయని న్యూ ఇండియా పార్టీ ఉపాధ్యక్షుడు జనగామ లక్ష్మీనారాయణ ఆరోపించారు. బుధవారం మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణానికి పెద్ద ఎత్తున ఖర్చు చేసినా నిలవకపోవడం బాధాకరమన్నారు. దీనికి ప్రభుత్వమే నైతికంగా బాధ్యత వహించాలని, ప్రజాధనం వృథా అయినందుకు సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు వేముల అశోక్, పద్మ, జేవీ.రాజు తదితరులున్నారు.

బ్యాటరీ స్టవ్‌ల పట్టివేత

సారంగాపూర్(జగిత్యాల): రూ.1.44 లక్షల విలువైన బ్యాటరీ స్టవ్‌లను పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారన్నారు. గడ్డం శ్రీనివాస్ జగిత్యాల నుంచి నిర్మల్ జిల్లా ఊట్నూర్‌కు వ్యాన్‌లో తరలిస్తున్న 72 బ్యాటరీ స్టవ్‌లను పట్టుకొని, సీజ్ చేసినట్లు తెలిపారు. తర్వాత వాటిని జిల్లా ఎన్నికల అధికారికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

రాయదండిలో ప్రజా అంకితయాత్ర



యాత్రలో ఎమ్మెల్యే చందర్

రామగుండం: అంతర్గాం మండలంలోని రాయదండిలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బుధవారం రాత్రి ప్రజా అంకితయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి, ఓటర్లను కలిశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నూతన మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆముల నారాయణ, సర్పంచ్ ధర్మాజి కృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు కొలిపాక శరణ్య, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: బీఆర్‌ఎస్‌తోనే ప్రజాసంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలంలోని సబ్బితం గ్రామానికి చెందిన మహేందర్ తదితరులు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి, ఆహ్వానించారు. సర్పంచ్ సదయ్య, మాజీ సర్పంచ్ గంకిడి శ్రీనివాస్, నాయకులు అభిలాష్, సంజీవ్, మహేందర్, సందీప్, సదానందం, చంటి, రవి, ప్రశాంత్ తదితరులున్నారు.

బీఎస్పీతోనే రైతుల కష్టాలు దూరం

- పార్టీ పెద్దపల్లి అభ్యర్థి దాసరి ఉష



మడకలో స్థానికులతో మాట్లాడుతున్న ఉష

ఓదెల(పెద్దపల్లి): బీఎస్పీతోనే రైతుల కష్టాలు దూరమవుతాయని ఆ పార్టీ పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష అన్నారు. బుధవారం ఓదెల మండలంలోని మడక గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విడుదల చేసిన మేనిఫెస్టోలో రైతుల కోసం ఉచితంగా ఎరువులు, విత్తనాలు, ఎకరానికి రూ.10 వేల ఆర్థికసాయం ఉన్నాయన్నారు. అన్నదాతల కష్టాలు తీర్చే బీఎస్పీ ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు దోపిడీ చేస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో వాటికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు బోయ సది, ప్రధాన కార్యదర్శి బండ నిఖిల్, కోశాధికారి ఎండీ.మోయిన్, కార్యదర్శి ఆరెల్లి వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

కమాన్‌పూర్: ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి మంథని నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలో జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. చుట్టపు చూపుగా వచ్చి మాయమాటలతో మభ్య పెట్టే నాయకులతో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంపీపీ రాచకొండ లక్ష్మి, నాయకులు పొన్నం రాజేశ్వరి, దాసరి రాయలింగు, నీలం సరిత, బొల్లపల్లి శంకర్‌గౌడ్, తాటికొండ శంకర్, కొలేటి చంద్రశేఖర్, గుర్రపు లక్ష్మీమల్లు, గడప కృష్ణమూర్తి, ఇంతియాజ్, సంపత్ పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

- దంపతులకు తీవ్ర గాయాలు



గాయపడిన దంపతులు

సుల్తానాబాద్‌రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై విజేందర్ వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెద్దరాతుపల్లికి చెందిన పాడిశెట్టి రమేశ్ బుధవారం తన భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై సుల్తానాబాద్ వచ్చాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్తుండగా అల్లీపూర్ శివారులో కాల్వశ్రీరాంపూర్ నుంచి సుల్తానాబాద్ వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రమేశ్ కాలు విరిగింది. అతని భార్యకు గాయాలయ్యాయి. బాధితులను బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- మృతుడు పెద్దపల్లి మండలం కనగర్తి వాసి



శ్రీనివాస్ మృతదేహం

రామగుండం: లారీ ఢీకొని, ఓ వ్యక్తి మృతిచెందాడు. అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్ వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని కనగర్తికి చెందిన గుంటి శ్రీనివాస్(45) ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. ప్రతీరోజు స్వగ్రామం నుంచి ఆర్టీసీ బస్సులో విధులకు హాజరవుతున్నాడు. బుధవారం ఉదయం పని ముగించుకొని, ఇంటికి వెళ్తూ పనిమీద ఎన్టీపీసీ రాజీవ్ రహదారి ఐవోసీ బస్టాప్ వద్ద దిగాడు. రోడ్డు దాటుతుండగా కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

రక్షణతో విధులు నిర్వర్తించాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



మ్యాప్‌ను పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని:రక్షణతో విధులు నిర్వర్తించి ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. బుధవారం జీడీకే–2వ గనిని ఆయన సందర్శించి ఉత్పత్తి వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు రక్షణపై ప్రతిఒక్కరూ దృష్టిసారించాలన్నారు. గని భవిష్యత్, రాబోయే రోజుల్లో తీయాల్సిన బొగ్గు ఉత్పత్తి గురించి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గనిలోకి దిగి 4సీమ్, 4/16ప్యానెల్‌ను సందర్శించారు. రక్షణ చర్యలను తనిఖీ చేశారు. జీఎం వెంట ఏజెంట్ చంద్రశేఖర్, కాలరీ మేనేజర్ తిరుపతి, సేఫ్టీ అధికారి వెంకటేశ్వర్లు, సెక్షన్‌ఇన్‌చార్జి మాధవరెడ్డి, సర్వే అధికారి దామోదర్ పాల్గొన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం గురువయ్య

రామగిరి: కార్మికులు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సేఫ్టీ జీఎం గురువయ్య సూచించారు. బుధవారం ఆర్జీ–3 డివిజన్‌లోని ఏపీఏ గనిని సందర్శించారు. పనిస్థలాల వద్ద ఉద్యోగులతో మాట్లాడి రక్షణపై తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పంచ్‌ఎంట్రీలోని పని స్థలాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ–3, ఏపీఏ, ఆర్జీ సేఫ్టీ జీఎంలు ఎస్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు, ఎస్.సాంబయ్య, ప్రాజెక్టు అధికారులు కె.నాగేశ్వర్‌రావు, కె.రాజేందర్, ఇంజినీర్లు టి.రఘురాం, ఎం.నాగరాజు, సూపరింటెండెంట్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ కె.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులను ఖండించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

గోదావరిఖని:పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమక్రసీ జిల్లా కార్యదర్శి కె.విశ్వనాథ్ కోరారు. బుధవారం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాలస్తీనాలోని గాజా ప్రాంతంపై దాడులను నియంత్రించేలా ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవాలన్నారు. పాలస్తీనా జాతీయులు తమ మాతృభూమిని 75 ఏళ్ల క్రితం కోల్పోయారని, ప్రస్తుతం నిలువ నీడలేక వలస పక్షులుగా మారారని పేర్కొన్నారు. అమెరికా అండతో ఇజ్రాయిల్ చేసే దురాక్రమణను వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, ప్రసాద్, చింతల శేఖర్, ఐలయ్య, మల్లయ్య, ఆనందరావు, రాయపోశం తదితరులు పాల్గొన్నారు.